సాక్షి జగిత్యాల

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



నృసింహునికి పూజలు

ధర్మపురి : నృసింహుని సన్నిధిలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.



గోశాలకు కోడెలు

వేములవాడఅర్బన్: 20 రాజన్న కోడెలను వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం హనుమాన్ గోశాలకు అందజేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిర్భయంగా పరీక్ష రాయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను నిర్భయంగారాయాలని తొలిమెట్టు కార్యక్రమ జిల్లా పరిశీలకుడు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం, వేములకుర్తి ప్రాథమిక, జెడ్పీ హైస్కూళ్లను ఆయన సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలో అమలవుతున్న తొలిమెట్టు కార్యక్రమం తీరు గురించి ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, శ్రీధర్‌కుమార్, అభయ్‌రాజ్, గణేశ్, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న సురేశ్

కథలాపూర్(వేములవాడ): విద్యార్థులు సెల్ ఫోన్‌లను ఎక్కువగా వినియోగిస్తూ, వాటికి బానిసలు కావొద్దని, చదువులపై దృష్టి పెట్టాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సురేశ్ సూచించారు. గురువారం భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బాలల హక్కులు– చట్టాల గురించి ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థి దశ కీలకమని, చదువుతోపాటు క్రీడలకు విద్యార్థులు సమయం కేటాయించాలని అన్నారు. విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజ నిర్మాణం లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పెగడపల్లి(ధర్మపురి): కుష్ఠు రహిత సమాజ నిర్మాణం కోసం కృషిచేయాలని కుష్ఠు నిర్మూలన బృందం రాష్ట్రస్థాయి సభ్యులు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం బృందం సందర్శించింది. మండలంలో నమోదైన కేసుల వివరాలను వారు ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలో పర్యటిస్తూ పీహెచ్‌సీలను సందర్శించి కేసుల వివరాలు సేకరిస్తామని అన్నారు. కుష్ఠుపీడితులను సకాలంలో గుర్తించి వైద్య సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో బృందం సభ్యులు వెంకటేశ్వరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సురేందర్, జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాస్, పీఎంవో రూప, డీపీఎంవో దేవసింగ్, వాల్యా, మెడికల్ అధికారి నరేశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న వెంకటేశ్

జగిత్యాలరూరల్: సబ్సిడీ రుణాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని సెర్ప్ అధికారి వెంకటేశ్ అన్నారు. స్థానిక సెర్ప్(గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) కార్యాలయంలో సెర్ప్, స్త్రీనిధి సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా మహిళా సంఘాలకు పీఎంఎఫ్ఎంఈ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేస్తున్నారని, ఇందుకోసం రాయితీపై రుణాలు అందిస్తామన్నారు. వీటిద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రుణాలపై 35 శాతం రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. ఈ విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆనందరావు మాట్లాడుతూ, జిల్లాలో స్త్రీనిధి రుణాల రికవరీ వందశాతం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, రవీందర్, సంతోష్, స్త్రీనిధి మేనేజర్లు మారుతి, రాణి పాల్గొన్నారు.

బాధతో పార్టీని వీడుతున్నా..

- కొందరి స్వార్థపూరిత కుట్రకు బలయ్యా..
- జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి
- బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వం, కౌన్సిలర్ పదవికి రాజీనామా
- రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశం



విలేకరుల సమావేశంలో తన ఆవేదన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి

జగిత్యాల: 'తెలంగాణ ఆడబిడ్డను.. ఆత్మాభిమానం ఎక్కువ.. అందుకే వేధింపులు భరించలేకపోతున్న.. ముందుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశా.. పార్టీకోసం ఎంతో సేవ చేసిన.. పార్టీని నమ్ముకున్న.. అయినా, కనీసం ఓదార్పు లేదు.. అందుకే బాధతో బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, 37వ వార్డు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తున్న' అని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి ఆవేదన వ్యక్తం చేయడం చర్చనీయాశంగా మారింది. జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌కు పంపించానని భోగ శ్రావణి వెల్లడించారు.

ఎమ్మెల్యే లక్ష్యంగా రాజీనామా..

బల్దియాలోని 27మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కలిసి అప్పటి చైర్‌పర్సన్ శ్రావణిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటూ గతనెల 23న స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. అయితే, శ్రావణి ఒకడుగు ముందుకేసి.. అదేనెల 25న తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. రాజీనామా చేసి దాదాపు నెలరోజులు గడిచినా నమ్మిన పార్టీ నుంచి ఎలాంటి ఓదార్పు లేకపోవడం, అధిష్టానం కనీసం సానుభూతి వ్యక్తం చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనైన శ్రావణి.. పార్టీ సభ్యత్వంతోపాటు పాటు కౌన్సిలర్ పదవికీ రాజీనామా చేశానని ప్రకటించారు.

ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం..

తాను బీఫాం ఇవ్వడంతోనే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి దక్కినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చెప్పడాన్ని భోగ శ్రావణి తప్పుపట్టారు. తాను ప్రజల ఆశీర్వాదంతోనే మున్సిపల్‌చైర్‌పర్సన్ పదవిని అధిష్టించానని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే అనుకున్నది సాధించారని శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని నమ్ముకుని క్రమశిక్షణ గల కార్యకర్తగా, పార్టీ ఇచ్చిన ప్రతీ పనిని విజయవంతంగా పూర్తిపనిచేశానని ఆమె వెల్లడించారు. ఉప ఎన్నికల్లోనూ కష్టపడి పనిచేశానని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 37వ వార్డు ప్రజలు తనను క్షమించాలని వేడుకున్నారు. అణచివేతకు గురైన తెలంగాణ ఆడబిడ్డగా.. ఆత్మాభిమానం చంపుకోలేక.. తన పదవులకు రాజీనామా చేశానే తప్ప ఎప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పోరాడుతానని శ్రావణి వెల్లడించడం గమనార్హం.

ఎమ్మెల్సీ కవిత ఆహ్వానంతో పార్టీలోకి..

ఎమ్మెల్సీ కవిత ఆహ్వానం మేరకు తాను బీఆర్‌ఎస్‌లో చేరానని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీర్వాదంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతలు నిర్వర్తించానని శ్రావణి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రజాసేవకు అంకితమైన తాను తన పదవికి రాజీనామా చేసినా ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై తన ఫొటో కనిపించకుండా చేశారని, పార్టీతో సంబంధాలు లేనట్లుగానే తనపట్ల వ్యవహరించారని ఆమె విమర్శలు చేశారు.

శ్రావణికి బెదిరింపులు..

చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసిన అనంతరం తనకు బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని, తన మద్దతుదారులనూ బెదిరిస్తున్నారని శ్రావణి ఆవేదన చెందారు. తనను, తన కుటుంబాన్ని అవమానించేలా ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీలో తనలాంటివారు ఎంతోమంది ప్రజాప్రతినిధులు ఇలా వేధింపులకు గురవుతూ ఉన్నారని, కనీసం వారికైనా పార్టీలో భరోసా ఇవ్వాలని భోగ శ్రావణి అధిష్టానాన్ని కోరారు. కాగా, అన్నిపదవులను త్యజించినట్లు శ్రావణి ప్రకటించడం జిల్లావ్యాప్తంగా మరోసారి సంచలనంగా మారింది.

కళ్లకు అధిక ప్రాధాన్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



వైద్యశిబిరంలో జడ్జి నీలిమ, లాయర్లు

జగిత్యాలజోన్: మనిషి అవయవాల్లో కళ్లకే అధిక ప్రాధాన్యం ఉందని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా కోర్టులో గురువారం కంటి వెలుగు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన జడ్జి... తొలుత కంటి పరీక్ష చేయించుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మొబైల్ ఫోన్లు అతిగా వినియోగించడంతో కళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. కళ్లు అలసిపోయి చూపు మందగిస్తుందని తెలిపారు. డాక్టర్ శ్రీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్, కార్యదర్శి ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో 14 ట్యూటర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు కాంట్రాక్ట్ పద్ధతిన ట్యూటర్లను ఎంపిక చేస్తామని కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. అర్హత గలవారు మార్చి 3వ తేదీ వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. రోజూ ఉదయం 10 – సాయంత్రం 5 గంటల వరకు జగిత్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు www.jagtial.telangana.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్(జగిత్యాల): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మీరు .. నేను కార్యక్రమంలో భాగంగా పల్లెనిద్ర చేపడుతున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి సింగరావుపేట గ్రామంలో మీరు .. నేను కార్యక్రమంలో భాగంగా పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టిందన్నారు. ప్రతీఇంట్లో లబ్ధిదారులున్నారని గుర్తుచేశారు. అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే తన ధ్యేయమన్నారు. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న విమర్శలు తిప్పికొట్టేలా సోషల్ మీడియాలో కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. సర్పంచ్ రాంచందర్‌రావు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, సర్పంచ్ రాంచందర్‌రావు, ఉపసర్పంచ్ భీమయ్య, నాయకులు ఓదెలు, రవి, భీమయ్య, అశోక్, మల్లేశం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డిప్యూటీ కమిషనర్ తనిఖీ

మల్యాల(చొప్పదండి): పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ గురువారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచ్ మిట్టపల్లి, ఎంపీడీవో వాసవి, డీఎల్పీవో కనకదుర్గ, కార్యదర్శి రవీందర్ ఉన్నారు.

నర్సింగాపూర్, తాటిపల్లిలో..

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్, తాటిపల్లి ఎస్పీఏ జాతీయ అవార్డులకు ఇటీవల ఎంపికయ్యాయి. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆయా పంచాయతీల్లో పర్యటించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- తరలింపుపై పటిష్టమైన నిఘా
- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. కలెక్టర్ అధ్యతన గురువారం జిల్లాస్థాయి ఇసుక నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆమోదిత ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఇప్పటి వరకు తీసిన ఇసుక, మిగిలిన ఇసుక ఎంత అనే సమాచారం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కొత్తగా ఇసుక రీచ్‌లు గుర్తించి తనకు నివేదించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టే సేవలు సమాజ హితం కోసమేనని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సొసైటీ ఎంతో గొప్పదని, రక్తదాన శిబిరాలు ఇంకా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మంచాల కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శ్రేణుల్లో జోష్

- అల్గునూర్ నుంచి బైక్ ర్యాలీ



వేదికపై అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్: సీపీఐ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి తొలిసారిగా వచ్చిన కూనంనేని సాంబశివరావుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఎర్ర చొక్కాలు ధరించి కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం గుండ్లపల్లి, రేణికుంట, నుస్తులాపూర్, అల్గునూర్ చౌరస్తాల్లో సీపీఐ కార్యకర్తలు రాష్ట్ర కార్యదర్శి కూనంనేనికి, పార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డికి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. అల్గునూర్ నుంచి ఓపెన్ టాప్ జీప్‌లో కూనంనేనితోపాటు చాడ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ వచ్చారు. కమాన్ చౌరస్తా వద్ద మహిళలు, డప్పు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షతన రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించారు. రాష్ట్ర నాయకులను జిల్లా పార్టీ పక్షాన గజమాలలతో సత్కరించారు. కూనంనేని సాంబశివరావు, చాడ మాట్లాడుతూ ఓట్లు, సీట్లు, అధికారం కోసం ఎర్రజెండా పుట్ట లేదని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, తాండ్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోశిక మోహన్, పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, అందె స్వామి, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బత్తుల బాబు, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ, పైడిపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వంతెన పనులకు భూమిపూజ

సాక్షి స్పందన

సారంగాపూర్(జగిత్యాల): కోనాపూర్ శివారుల్లో హైలెవల్ వంతెన నిర్మాణానికి శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమిపూజ చేయనున్నారు. అక్కడి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరడంతో దానిస్థానంలో కొత్త వంతెన నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.5.65 కోట్లు వెచ్చిస్తారు. జగిత్యాల–సారంగాపూర్, బీర్‌పూర్‌తోపాటు మంచిర్యాల జిల్లా జన్నారం ప్రాంతాలను కలిపే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై కోనాపూర్ వద్ద హైలెవల్ వంతెన నిర్మిస్తారు. 'భయం భయంగా ప్రయాణం' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 22న కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఈ పనులతోపాటు రూ.86.68లక్షల వ్యయంతో దుబ్బరాజన్న ఆలయ ప్రాకారమండపం, రాజగోపురం పనులకు భూమిపూజ చేస్తారని అధికారులు తెలిపారు.

'ఆటోమేటిక్' సమస్యలు

- తొలగించాలంటున్న అధికారులు
- తొలగిస్తే పంటలు ఎండుతాయంటున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయ బావులు, బోర్లతోపాటు ఎస్సారెస్పీ, వరద కాల్వలకు విద్యుత్ మోటార్లు బిగించుకుని రైతులు పంటలకు సాగునీరు అందిస్తున్నారు. అయితే, విద్యుత్ మోటార్లను ఆన్, ఆఫ్ చేసేందుకు స్టార్టర్ బాక్స్ ఉంటుంది. ఈ స్టార్టర్ బాక్స్‌లో రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను బిగిస్తుండటం విద్యుత్ శాఖకు తలనొప్పిగా మారుతోంది. వీటిని తొలగించాలని ఓ వైపు ఉన్నతాధికారుల నుంచి ఇటీవల అదేశాలు రావడం, మరోవైపు.. పంటలు ఎండిపోతాయని రైతుల నుంచి పెద్దఎత్తున నిరసలు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏం చేయాలన్న దానిపై అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ఇటీవల మల్యాల, వెల్గటూర్ సెక్షన్ల పరిధిలో ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించారు. దీంతో రైతులు ఆందోళనలు చేస్తున్నారు.

జిల్లాలో 1.33 లక్షల కనెక్షన్లు..

- జిల్లాలో సుమారు 1.33 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.
- ఇవికాకుండా, అనధికారికంగా మరో ఐదారు వేల వరకు కనెక్షన్లు ఉంటాయని అంచనా.
- మొన్నటివరకు విద్యుత్ వినియోగం సాధారణ స్థాయిలోనే ఉండగా, ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కొద్దీ విద్యుత్ వినియోగం డిమాండ్ పెరుగుతోంది.



జగిత్యాల శివారులోని ఓ రైతు బిగించిన ఆటోమేట్ స్టార్టర్

- జనవరిలో విద్యుత్ కోటా 107.87 మిలియన్ యూనిట్లు ఉండగా, వినియోగం పెరిగి 116.657 మిలియన్ యూనిట్లకు చేరింది.
- ఈనెలలో 95.71 మిలియన్ యూనిట్ల కోటా ఉంటే అంతకుమించే వినియోగమవుతోంది.
- ఐఎస్ఐ బ్రాండ్ ఉన్న 3 హెచ్‌పీ విద్యుత్ మోటార్ వినియోగిస్తే గంటకు 2.24 యూనిట్లు ఖర్చు అవుతాయి. అలా, ఎన్ని గంటలు నడిస్తే అన్ని యూనిట్ల విద్యుత్ ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు.
- అదే 5 హెచ్‌పీ సామర్థ్యం అయితే 3.73 యూనిట్లకరెంటు ఖర్చు అవుతుంది.
- ప్రస్తుతం విద్యుత్‌ను ఐఈఎక్స్ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పోటీపడి కొనుగోలు చేస్తే.. యూనిట్‌కు రూ.50 వరకు చెల్లించాల్సి వస్తోంది. అయినా, విద్యుత్ లభించని పరిస్థితి ఏర్పడుతోంది.

50శాతం మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లు..

జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగినప్పుడు, మోటార్లకు త్రీఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. దీంతో 50 శాతం మోటార్లకు స్టార్టర్ బాక్స్‌లో ఆటోమెటిక్ స్టార్టర్లను రైతులు బిగించారు. అధికారుల లెక్కల ప్రకారం కేవలం ఐదారువేలు మాత్రమే ఉంటాయంటున్నారు. ఆటోమెటిక్ స్టార్టర్ స్విచ్‌ను ఒకసారి అన్ చేస్తే.. కరెంట్ ఉన్నప్పుడు మోటార్ నడుస్తుంది.. కరెంట్ సరఫరా ఆగిపోతే మోటార్ ఆటోమేటిక్‌గా ఆఫ్ అవుతుంది. ఇక్కడే పెద్ద సమస్య ఎదురవుతోంది. వ్యవసాయ రంగానికి విద్యుత్ ఉచితంగా ఇస్తుండటంతో రైతులు ఎక్కువగా కరెంట్ మోటార్లపైనే ఆధారపడుతున్నారు. దీనికితోడు జిల్లాలో వరి దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. రైతులు మోటార్ వద్దకు వెళ్లి ఆటోమెటిక్ స్టార్టర్ ఆన్‌చేసి వస్తున్నారు. ఒకసారి ఆన్ చేసారంటే, మరుసటి రోజు వరకు రైతులు అటువైపు వెళ్లడంలేదు. ఒకవేళ మోటార్ పంపులో నీరు దిగిపోయినప్పటికీ అది నడుస్తూనే ఉంటుంది. దీంతో, యూనిట్ల కొద్దీ విద్యుత్ సంస్థ నష్ట పోవాల్సి వస్తోంది.

ఎలాంటి నష్టం జరుగుతుందంటే..

- ఆటోమెటిక్ స్టార్టర్లతో విద్యుత్ సంస్థ తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటోంది.
- అంతేగాకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయలేక, పంపిణీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- సాధారణంగా లోడ్ పెరిగినప్పుడు సింగిల్‌ఫేజ్, త్రీ ఫేజ్‌లు విద్యుత్ సరఫరా చేయాల్సి వస్తోంది.
- ఇలాంటి సమయాల్లో సబ్‌స్టేషన్లలో కరెంట్ ఆఫ్ చేస్తుంటారు.
- తర్వాత, కరెంట్ వేయగానే ఆటోమెటిక్ స్టార్టర్లన్నీ ఒకేసారి ఆన్ అవుతాయి. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ పడుతోంది.
- దీంతో, ఫ్యూజులు ఎగిరిపోతూ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి.
- దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్‌కు చివరన ఉన్న రైతుల మోటార్లు కూడా నడవకపోవడమే కాకుండా మోటార్లు కాలిపోయే పరిస్థితి దాపురిస్తోంది.
- ఒకట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే విద్యుత్ సంస్థకు దాదాపు రూ.లక్ష వరకు, ఒక మోటార్ కాలిపోతే రైతుకు రూ.3 వేల వరకు నష్టం వాటిల్లుతుంది.

ఎప్పుడు పోతుందో తెలియదు



కరెంట్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. అందుకోసమే ఆటోమెటిక్ స్టార్టర్లు పెట్టుకుంటున్నం. నీటి అవసరం లేనప్పుడు బంద్ చేస్తున్నం. గంటకోసారి పొలం వద్దకు పోవుడు ఇబ్బందిగా ఉంది.

– కోల నారాయణ, రైతు, చల్‌గల్

వృథా అవుతోంది..



ఆటోమెటిక్ స్టార్టర్లతో అవసరమైన దానికంటే ఎక్కువ విద్యుత్ వృథా అవుతోంది. తద్వారా పంపిణీ సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వేసవిలో అదనపు కరెంట్ కొనుగోలు చేయాలంటే లభించే పరిస్థితి లేదు. ఒక్కో యూనిట్‌కు రూ.50 వెచ్చించి ప్రైవేట్ కంపెనీల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. రైతులు అర్థం చేసుకుని ఆటోమెటక్ స్టార్టర్లను తొలగించాలి.

– సత్యనారాయణ, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

క్లుప్తంగా

రాయపూర్ ప్లీనరీకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ ప్లీనరీకి హాజరయ్యేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. ఈనెల 25, 26వ తేదీల్లో జరిగే అఖిల భారత కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీకి ఆయన హాజరు కావాల్సి ఉంది. ఈమేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఆయనకుక పిలుపు వచ్చింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ సమావేశాలకు దేశం నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ డెలిగేట్లు హాజరు కానున్నారు.

'కళ్లున్నా.. అభివృద్ధి చూడలేని లక్ష్మణ్‌కుమార్'

వెల్గటూర్(ధర్మపురి): కళ్లు ఉన్నా జరుగుతున్న అభివృద్ధిని చూడలేని గుడ్డివాడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అని బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే ఇకనుంచి ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిపాక వెంకటేశ్, రాంచంద్రం, జూపాక కుమార్, మూగల సత్యం, పెద్దూరి భరత్, పాడేటి రవి తదితరులు పాల్గొన్నారు.

హెల్పర్‌కు విద్యుదాఘాతం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వేములకుర్తి గ్రామంలో ప్రైవేట్ హెల్పర్ గాంధారి శ్రీకాంత్ గురువారం విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. స్తంభంపై మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభం పైనుంచి పడి గాయాలకు గురయ్యాడు. లైన్‌మెన్ రాజు వెంటనే స్పందించి మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. శ్రీకాంత్ ఆర్థిక పరిస్థితి అంతంతగానే ఉంది. దాతలు సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. 97011 90413 నంబరుకు ఫోన్‌పే లేదా, గూగుల్ పే చేయాలని విన్నవిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు


జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన క్కశెట్టి లక్ష్మీరాజంను ఢీకొట్టిన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. తాటిపల్లికి చెందిన బక్కశెట్టి లక్ష్మీరాజం గురువారం పని నిమిత్తం మేడిపల్లి గ్రామానికి వెళ్లి తాటిపల్లికి చేరుకుంటుండగా ఆర్టీసీ డ్రైవర్ అతివేగంగా వచ్చి లక్ష్మీరాజం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో లక్ష్మీరాజంకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు బక్కశెట్టి వెంకటేశ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గల్ఫ్ ఏజెంట్‌పై..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొడ్డున శేఖర్‌తో పాటు తన ఇద్దరు స్నేహితులను కెనడా పంపిస్తానని నమ్మించి మోసం చేసిన ఊబిది రాజుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొడ్డున శేఖర్, అతడి ఇద్దరు స్నేహితులు మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ ఊబిది రాజును కెనడా పంపిస్తామని చెప్పడంతో నమ్మి పాస్‌పోర్టులు ఇచ్చారు. వారినుంచి రూ.50వేల చొప్పున ఏజెంట్ వసూలు చేశాడు. కెనడా పంపించకుండా మోసం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆస్పత్రి అభివృద్ధిపై పట్టింపేది?


ఆస్పత్రి భవనం


అస్తవ్యస్తంగా ఆపరేషన్ థియేటర్

- సమస్యలతో పేషెంట్లు, ఉద్యోగుల సతమతం
- వైద్య విధాన పరిషత్‌లో నిధులేమి
- జాడలేని అభివృద్ధి కమిటీ!

రాయికల్(జగిత్యాల): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గతేడాది అక్టోబర్‌లో వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వెళ్లింది. అప్పటినుంచి ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేకమైన చర్యలు ఏమీ తీసుకోవడంలేదు. కనీసం ఇప్పటివరకు నిధులు కూడా మంజూరు కాలేదు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ జాడ కూడా లేకుండాపోయింది. ఫలితంగా ఆస్పత్రిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వాటితో అటు వైద్య సిబ్బంది, ఉద్యోగులతోపాటు ఇటు పేషెంట్లు అవస్థలు పడుతున్నారు. మౌలిక వసతులు లేక వైద్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది.

పాత పరికరాలతోనే ఆపరేషన్లు..

- ఆస్పత్రి అభివృద్ధి కోసం నిధులు మంజూరు కాలేదు.
- గతంలో ఉన్న పరికరాలతోనే ఆపరేషన్లు చేయాల్సి వస్తోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన జనరేటర్, ఈసీజీ మిషన్, పల్స్ ఆక్సిమీటర్, ఆటోక్లీనింగ్ మిషన్, ఆక్సిజన్ సిలిండర్ కొరతతోపాటు బెడ్లపై దుప్పట్లు లేకపోవడం, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది.

ఐదు నెలలైనా ఏర్పాటు కాని కమిటీ..

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారినా.. ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ నియామకం ఇప్పటికీ జరగలేదు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రద్దు కావడంతో అభివృద్ధి కమిటీ సైతం రద్దయ్యే అవకాశం ఉంది. మున్సిపల్ కౌన్సిలర్లకు ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఉండే అవకాశం ఉంది.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> 
>
> వైద్య విధాన పరిషత్‌లోని సమస్యలపై ఎప్పటికప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నాం. నిధుల మంజూరు కావడంలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీని నియమించి అభివృద్ధికి కృషి చేయాలి. – రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అదిరిన అన్నదాతల ఐడియా

- తోట నుంచి నేరుగా వినియోగదారు చెంతకు..
- అందుబాటులో నాలుగు రకాల పండ్లు
- జోరుగా విక్రయాలు

సారంగాపూర్(జగిత్యాల): అన్నదాతల ఐడియాలు అదిరిపోయాయి.. తోటలో పండించిన పండ్లను నేరుగా వినియోదారులకు అందించడానికి నాలుగు రకాల తర్బూజాలను అందుబాటులో ఉంచి లక్ష్యం సాధించారు.. అనుకన్నదానికన్నా అధికంగా విక్రయాలు చేసి ఔరా అనిపించారు పెంబట్ల గ్రామానికి చెందిన అన్నదాతలు.. పెంబట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్, మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్, సిర్‌పూర్ గ్రామానికి చెందిన నరేశ్‌తోపాటు మల్లాపూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన రాజు, రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన రాంరెడ్డి, రాజు రైతు తమకున్న వ్యవసాయ క్షేత్రాల్లో మూడేళ్లుగా తర్బూజా పండిస్తున్నారు. ప్రస్తుతం శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయాధికారుల సలహాలు, యూట్యూబ్ చానెల్ ద్వారా సాగు పద్ధతులుపై సమగ్ర సమాచారం సేకరించారు. ఆమేరకు నాలుగు అరుదైన రకాల తర్బూజాలు ఎంచుకుని పంట సాగుచేశారు. ఇందులో అత్యంత అరుదైన జెన్నత్, విశాల్, అరోహి రకాలు ఎంపిక చేసుకున్నారు. జెన్నత్ రకం పండుపై మీద ఆకుపచ్చ వర్ణం, గుండ్రని ఆకారం, లోపుల ఆకర్షించే ఎరుపు రంగ, తీయ్యని రుచి ఉంటుంది. విశాల్ రకం పండు పసుపు రంగులో ఉండి, లోపల ఎరుపు, అరోహి పండు నలుపు ఆకుపచ్చ రంగులో ఉండి, లోపల పసుపు రంగులో ఉంటుంది. ఇవి ప్రస్తుతం మాల్స్‌లోనే లభ్యమవుతున్నాయి. కానీ, వీటిని ఆదర్శ రైతులు సాగుచేశారు. వినియోదారురులకు నేరుగా విక్రయిస్తున్నారు. వీటితోపాటు సూపర్‌క్వీన్ వెరైటీ తర్బూజాను సాగుచేసి విక్రయించడం గమనార్హం. ఇది చాలా తియ్యగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కాగా, అరోహి వెరైటీని కిలోకు రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. మాల్స్‌లో దీనిధర రూ.50వరకు పలుకుతోంది. మిగతా పండ్లను కిలోకు రూ.20ధరతో విక్రయిస్తున్నారు.


జాతరలో తర్బూజాలు విక్రయిస్తున్న రైతులు

దుబ్బరాజన్న జాతరలో 4 టన్నుల విక్రయం

ఇటీవల జరిగిన దుబ్బరాజన్న జాతరలో మూడు రోజుల పాటు భక్తులకు తర్బూజాలు విక్రయించారు. అందుబాటు ధరలో సుమారు నాలుగు టన్నుల వరకు విక్రయించినట్లు రైతులు తెలిపారు. కాగా, తర్బూజా సాగు పద్ధతులు తెలుసుకునేందుకు మహారాష్ట్రలోని క్షేత్రప్రదర్శనకు తరలివెళ్లినట్లు ఆ రైతులు తెలిపారు.

బైక్ కొనిచ్చినా యువకుడి ఆత్మహత్య

- తల్లిదండ్రులకు శోకం మిగిల్చిన కుమారుడు

ధర్మపురి: సాధారణంగా బైక్ కొనివ్వలేదనే బెంగతో యువకులు ఆత్మహత్య చేసుకోవడం సహజం. కానీ, తల్లిదండ్రులు ఎంతోకష్టపడి బైక్ కొనిచ్చినా.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నాగారం గ్రామానికి చెందిన జెల్ల హరీశ్(24) ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. పోలీసుల కతనం ప్రకారం.. ధర్మపురి మండలం నాగారం గ్రామానికి చెందిన జెల్ల వెంకటి – కొమురక్క దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడికి వివాహైంది. రెండోకుమారుడు జెల్ల హరీశ్ ముంబయిలోని కల్లు దుకాణంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సెలవులపై రెండు నెలల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. తనకు బైక్ కొనివ్వాలని నెల క్రితం తల్లిదండ్రులను డిమాండ చేశారు. చేతిలో డబ్బులు లేవని చెప్పినా వినిపించుకోలేదు. కొడుకు కోరిక తీర్చేందుకు తల్లిదండ్రులు తమకు తెలిసిన వారివద్ద రూ.70వేలు అప్పు చేశారు. సుమారు 20రోజుల క్రితం బైక్ కొనిచ్చారు. అప్పటివరకు గ్రామంలో చలాకీగా తిరిగిన హరీశ్.. వాహనం కొనుగోలు చేశాక ఇంటినుంచి బయటకు వెళ్లనేలేదు. అత్యవసరమైన పనిఉంటేనే వెళ్లేవాడు. తల్లిదండ్రులు తమ పనులకు బయటకు వెళ్లినా.. హరీశ్ ఒంటరిగా ఇంట్లోనే ఉండేవాడు. ఇంట్లోఉంటూ ఏం చేస్తున్నావని తల్లిదండ్రులు మందలించినా హరీశ్ నుంచి స్పందన రాలేదు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో సమీప పశువుల పాకలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చి చూడగా హరీశ్ శవమై కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏదోబలమైన కారణంతోనే యువకుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి వెంకటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


హరీశ్(ఫైల్)

పేకాటరాయుళ్ల అరెస్ట్

కథలాపూర్(జగిత్యాల): పెగ్గెర్ల గ్రామశివారులోని ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలో పేకాట శిబిరంపై కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. 10 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారినుంచి రూ.17,570 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా కొన్ని నెలలుగా కథలాపూర్, పెగ్గెర్ల గ్రామాల మధ్య ఎస్సారెస్పీ వరదకాలువ ప్రాంతంలో ఓ వ్యక్తి షెల్టర్ ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల వ్యక్తులతో పేకాట ఆడిస్తున్నట్లు జోరుగా చర్చించుకుంటున్నారు. ఇదే పేకాట శిబిరంపై ఇన్నాళ్లకు పోలీసులు దాడి చేసి పట్టుకోవడం విశేషం.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మంకమ్మతోటకు చెందిన అవేజ్(19) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ అతడి తల్లితో ఉండేవాడు. అతడి బైక్‌పై లోన్ ఉండడంతో అది కట్టే పరిస్థితులు లేక బాధపడుతుండేవాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండడంతో తన తల్లితో బుధవారం రాత్రి డబ్బుల గురించి గొడవ జరిగింది. దీంతో అవేజ్ తల్లి తన కూతురు ఇంటికి వెళ్లింది. ఈక్రమంలో మనస్తాపానికి గురైన అవేజ్ గురువారం వేకువజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇటుకబట్టీలో పనిచేయలేం..

- మా ఇళ్లకు పంపించండి
- తహసీల్దార్, ఎస్సైకి వలస కూలీల మొర
- 11 మందిని పంపించిన అధికారులు

పెద్దపల్లిరూరల్: పొట్ట కూటి కోసం ఇటుకబట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన తాము ఇబ్బంది పడుతున్నామని, ఇక్కడ పనిచేయలేమని, తమను తమ ఇళ్లకు పంపించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి, బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్‌కు కొందరు వలస కూలీలు మొరపెట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సారంఘడ్ జిల్లా బార్‌పల్లి, రహనపల్లి గ్రామాల నుంచి వలస కూలీలు ఇక్కడకు వచ్చి పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ పనిచేసే ప్రాంతాల్లో వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అక్కడి అధికారుల నుంచి జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామంలోని ఇటుక బట్టీలో విచారణ జరిపారు. విచారణ కోసం వచ్చిన అధికారుల ఎదుట తాము తమ ఊళ్లకు వెళ్తామని చెప్పడంతో బ్రింకడియా, మునితకడియా, దీపక్‌కడియా, సంతోషి కడియా, సీమాకడియా, చైతూ కడియా, సుగుణ కడియా తో పాటు వారి పిల్లలు కరణ్‌కడియా, లఖన్‌కడియా, ప్రీతం కడియా, దీపక్‌కడియాను అధికారులు ఇళ్లకు పంపించారు. వలస వచ్చిన కూలీలతో యజమానులు ఇష్టానుసారంగా పనిచేయించుకుంటున్నారని, సరైన ఆహారం అందించడం లేదని ఆదివాసీ సంఘం నాయకులు ఆరోపించారు. తాము సర్దార్ ద్వారా కూలీలకు అడ్వాన్స్ చెల్లించామని, పనిచేయకుండా వాటిని ఎగ్గొటేందుకే ఇలా చేస్తున్నారని, కూలీలతీరుతో తాము నష్టపోవాల్సి వస్తోందని బట్టీ యజమాని తెలిపారు.


ఇటుకబట్టీలో విచారణ జరుపుతున్న తహసీల్దార్, ఎస్సై

ప్రభుత్వ ఫలాలు పేదలకు చేరాలి

- మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం

జగిత్యాల: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలన్నీ పేదలకు చేరాలని మాలల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించాలన్నారు. బాలికల అక్షరాస్యతా శాతం, వృద్ధి రేటును పెంచేందుకు మనవంతు సహకారం అందించాలని కోరారు. అట్టడుగు మాలజాతి బిడ్డలకు చేయూతనివ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి మాట్లాడుతూ, అన్యాయాలను ఎదుర్కోవాలన్నారు. అనంతరం మలల ఐక్యవేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురుమల్ల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా శోభన్, గౌరవ అధ్యక్షుడిగా వెంకటరమణ, సలహాదారుగా లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, ప్రకాశ్, రాజరత్నం, రాములు, గంగధర రమేశ్, చిట్టిబాబు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న నాయకులు

హైకోర్టు లైజెనింగ్ అధికారిగా మహ్మద్ వకీల్

జగిత్యాలటౌన్: జిల్లా ప్రభుత్వ శాఖలకు హైకోర్టు లైజెనింగ్ అధికారిగా.. డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ వకీల్‌ను నియమిస్తూ కలెక్టర్ యాష్మిన్ బాషా ఆదేశాలు జారీచేశారు. నియామకపత్రాన్ని కలెక్టరేట్ అధికారులు గురువారం వకీల్‌కు అందజేశారు. జగిత్యాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వకీల్.. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్(ట్రెసా)జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన నియామకంపై కలెక్టరేట్ పరిపాలనాధికారి నాగార్జున, ట్రెసా రాష్ట్ర కార్యదర్శి కాశీచరణ్, జిల్లా ఉర్దూ అధికారి కలీమొద్దీన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, ట్రెసా జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


నియామకపత్రం స్వీకరిస్తున్న వకీల్

కొడుకు మృతిని తట్టుకోలేక.. బావిలో దూకి తల్లి ఆత్మహత్య

మెట్‌పల్లి(కోరుట్ల): తన కొడుకు మృతిని తట్టుకోలేక మానసికంగా కుంగిపోయిన ఆ తల్లి బావిలో దూకి బలవన్మరణానికి ఒడిగట్టింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ మండలంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఆత్మకూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల లక్ష్మీరాజం – రాజగంగు(53) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు శివకుమార్(23) ఉన్నారు. కూతుళ్లకు వివాహం కాగా, చదువుకుంటున్న కుమారుడు మూడు నెలల క్రితం వరదకాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఉపాధి నిమిత్తం లక్ష్మీరాజం దుబాయ్‌కి వెళ్లగా, రాజగంగు ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. కుమారుడి మరణంతో మానసికంగా కకుంగిపోయిన ఆమె.. తనకు ఇక బతకబుద్ధి కావడం లేదని తరచూ కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కూతుళ్లు ఆమెకు ఫోన్ చేయగా, స్విచ్‌ఆఫ్ అని రావడంతో వారు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. బంధువులతో కలిసి పలుచోట్ల వెతికారు. చివరకు శివారులోని వ్యవసాయ బావిలో చూడగా మృతదేహం కనిపించింది. విగతజీవిగా మారిన తల్లిని చూసి కూతుళ్లు బోరున విలపించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.


కొడుకుతో రాజగంగు(ఫైల్)

రైలు కిందపడి ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- ష్యూరిటీ పెట్టడంతోనని మనస్తాపం
- విషాదం నింపిన ఘటన

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు పనాస భాస్కర్ (45) ఇతరుల చిట్టీలు, అప్పులకు ష్యూరిటీ ఇవ్వడమే ఆయన ప్రాణాలమీదికొచ్చింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన పట్టణ శివారులోని రైల్వే ఫ్లైఓవర్ వంతెన సమీపంలో గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన భాస్కర్.. రామగిరి మండలం పన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భార్య వాణి, ఇద్దరు పిల్లలతో యైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో భాస్కర్ కొందరికి ఫైనాన్స్ వ్యవహారాల్లో ష్యూరిటీ (జమానత్) గా ఉన్నారు. వారు కిస్తీలు సరిగా చెల్లించకపోవడంతో భాస్కర్ వేతనం నుంచి కోత పెడుతున్నారు. దీంతో భాస్కర్ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఏం చేయాలో తెలియక కొంతకాలంగా మనస్తాపానికి గురవుతున్న భాస్కర్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని రైల్వేహెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.


భాస్కర్(ఫైల్)

వెన్నంపల్లి, పోతనకాలనీలో విషాదం

కాల్వశ్రీరాంపూర్/యైటింక్లయిన్‌కాలనీ: భాస్కర్ పెద్దపల్లిలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో వెన్నంపల్లిలో విషాదం నెలకొంది. భాస్కర్ తండ్రి పోశెట్టి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి లక్ష్మి ఇంటివద్ద ఒంటరిగానే ఉంటోంది. భాస్కర్ 15ఏళ్లుగా పోతనకాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన మృతిపై తోటి ఉపాధ్యాయులు సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని వెన్నంపల్లికి తరలించారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా ఏఎస్సై శేఖర్ మాట్లాడుతూ, ప్రతీ వాహనదారు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దూరమై..

- అనారోగ్యంతో తండ్రి మృతి
- రోడ్డు ప్రమాదంలో తల్లి మృత్యు ఒడిలోకి..
- కన్నీళ్లు దిగమింగుకుని..
- ఒంటరివారైన చిన్నారులు

జగిత్యాలక్రైం: అల్లారు ముద్దుగా చూసుకునే తండ్రిని అనారోగ్యం పొట్టన పెట్టుకుంది.. గోరుముద్దలు తినిపిస్తూ ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యతలు చేపట్టిన తల్లిని రోడ్డు ప్రమాదం కబళించింది.. భవిష్యత్ గురించి తెలియని ఆ చిన్నారులను విధి వక్రీకరించింది.. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన ఇదీ.. గ్రామానికి చెందిన పూదరి శ్యామల(37) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందడం ఆ చిన్నారులను శోక సంద్రంలో ముంచింది. శ్యామల స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా సేవలు అందిస్తూనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో పార్ట్‌టైం అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఈనెల 18న విధులు ముగించుకుని స్వగ్రామం బయలు దేరగా.. చెర్లపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం శ్యామల ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది.


తల్లి శ్యామలతో యశ్వంత్, మారుతి(ఫైల్)

అనాథలైన పిల్లలు..

మోరపల్లి గ్రామానికి చెందిన పూదరి నాగభూషణం – శ్యామల దంపతులు.. వీరికి కుమారులు యశ్వంత్ (14), మారుతి (16) ఉన్నారు. నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతూ పదేళ్లక్రితం మరణించాడు. అప్పటినుంచి కుటుంబ బాధ్యతలు భుజానికెత్తుకున్న శ్యామల.. అనేక సవాళ్లను అధిగమిస్తూ తన పిల్లలను సాకుతూ, చదువు చెప్పిస్తూ వస్తోంది. కానీ, విధి వక్రీకరించింది. విధి నిర్వహణలో భాగంగా వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో ఆమెను కబళించింది. దీంతో చిన్నారులు ఒంటరివారయ్యారు. వీరిని చూసిన గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. తల్లిదండ్రులు మృతిచెందడంతో చిన్నారుల రోదనలు మిన్నంటాయి. కాగా, మృతురాలు బావ గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.